# డోంట్ వర్రీ... బీ హ్యాపీ!

మీ జీనియస్ బుర్ర ఉపయోగించి నా కొత్త స్కూలుకి పేరుపెట్టాలి – అన్నాడు. నేనందించిన గ్లాసు ప్రక్కన పెట్టేసి – "ఎందుకీ చక్కెర నీళ్లు నాకు పోస్తారు? మీకు తెలుసుగా – నాకు నేతి బీరకాయలు సయించవు. అసలు బీరకాయలుండాలి. అది సరే, నా పేరు?..." అంటూ చెమటలు క్రక్కుతున్న మొహాన్ని చొక్కా పైకెత్తి దాంతో తుడిచేసుకున్నాడు. రంగు నీళ్లు సిప్ చేశాను. "అయ్‌సీ..." అన్నాను. "ఇంగ్లీషా? తెలుగా?" అన్నానో లేదో –

"సరిపోయిందిలెండి... టెల్గూ మీడియమ్‌కి అంత సీను లేదిప్పుడు! ఓ మిత్రుడు తెలుగు స్కూలు పెట్టి దివాలా తీశాడు. ఆ ఎక్విప్‌మెంట్ అంతా నే కొనేశా... యిన్‌ఫ్రాస్ట్రక్చర్ అంతా రెడీ... ఇంగ్లీష్ మీడియమ్ పబ్లిక్ స్కూలు అప్ టు సెవెన్త్ లేదా వీలైతే అప్ టూ టెన్త్ లాగించేస్తాను".

నా బుర్ర బ్లాంక్ అయిపోయింది. "డోంట్ వర్రీ!... బీ హ్యాపీ! బాగా ఆలోచించి... రేపు నీకు నాలుగైదు అద్భుతమైన పేర్లు చెబుతాను" అన్నాను.

నిరాశగా లేచి, "ఓ.కే... పోస్టర్లు, బోర్డులూ చేయించాలి మరి! రేపు మాత్రం డోన్ట్ డిసప్పాయింట్ మీ! – ఎలా వచ్చాడో, అలాగే దూసుకుపోయాడు.

మమ్మీ డాడీ మోడ్రన్ స్కూలు పెడతాడన్న మాట యీ తరంగ్‌డు. మార్కెట్‌లో యితనికి మూడో నాలుగో బజ్జీల బండ్లు ఉన్నాయి. కూల్ డ్రింక్స్ షాపులో రెండున్నాయి. వీడికిదేం పాడుబుద్ధీ? అనుకున్నాను. కానీ ఇదేం పాడు బుద్ధి కాదు... ఇంగ్లీషు మీడియమ్ స్కూల్ రన్ చేయగలగాలే గానీ, సైకిల్ మీద పరిగెత్తే వాడు ఎయిర్ కండిషన్డ్ కారు మీద కులుకుతూ తిరగొచ్చు. కాకపోతే ట్వంటీ ఫోరవర్స్ టెన్షన్‌తో సాగే బిజినెస్ – పేరు సజెస్ట్ చెయ్యరాసామీ అన్నాడు కానీ, అటు పోలేదు నా మనసు. స్కూలు బిజినెస్ కథా కమామీషూ నా తలకాయలోపల రంగుల రాట్నం తిరిగేస్తోంది.

మామిడికాయల సీజన్, మల్లెపూల కాలం – యివన్నీ పోయాయి! మృగశిర భూమిని కాస్త చల్లబరిచింది. స్కూళ్ళ సీజన్ పుంజుకుంది. 'వానాకాలం చదువులు' అన్నది పాత మాట. ఒక శీతాకాలం లేదు, ఎండాకాలం లేదు. రైల్వే ప్లాట్‌ఫారమ్ మీది 'టీ' లాగా సర్వకాల సర్వావస్థలయందూ అక్కడ విద్యయొసగబడును.

వెనుకటికి గవర్నమెంట్ ప్రసాదులు –

**వీరాజీ**

అనగా ప్రభుత్వ సారా దుకాణాలు పెట్టినప్పుడు మేధావులంటూ ఉండేవారు – 'గవర్నమెంటు రంగంలో సారా – ప్రయివేటు రంగంలో విద్యా రాణిస్తాయి' అని. మా 'గుప్త తరంగ్' కూడా ఏదో మంచి ఫర్నిచర్ వగైరా ఉండి, 'తెలుగు' కారణంగా చచ్చిపోయిన – మంచి స్కూలు కొనుగోలు చేశాడట! ఔను... యిది కార్పొరేట్ కాలేజిలు, ఆస్పత్రులూ పరిగెడుతున్న కల్కి కాలం కదా!

మార్కుల దాహంతో అల్లాడిపోతున్న పేరెంట్స్‌కి, పిల్లకాయలకీ, తొంభై తొమ్మిది శాతం మార్కులు కావాలి. ఎందుకంటే వీళ్ళకి ప్రతిష్ట గల కార్పొరేట్ స్టార్ కాలేజిలు ఉచితంగానో, కన్సెషన్‌లోనో సీట్లు యిస్తారు. పేపర్లలో ఫోటోలు వేయిస్తారు. పిల్లలు స్కూలు నుంచి కాలేజికి మారే 'సీను' – అది వర్ణనాతీతం! వెయ్యి పడగల ఆదిశేషుడైనా స్కూలు ప్రారంభం నాటి సన్నివేశాల మీద ఫీచర్ సమగ్రంగా రాయలేడు. కానీ ఇప్పుడు కార్పొరేట్ కళాశాలల వాళ్ళే – ఎడ్యుకేషన్ సెక్టార్‌లో – హైస్కూలు బ్రాంచీలు కూడా మొదలెట్టి వాళ్ళ భాషలోనే చెప్పాలంటే – నూతన చరిత్రకు శ్రీకారం చుడుతున్నారు.

ఏ స్కూలు అయినా గంగోత్రి పుట్టిన గంగా నది పీలిక లాగే ఉంటుంది మొదట. వేమనజీ ఏమన్నాడు? 'విత్తనంబు మర్రి వృక్షంబున కెంత?" అని కదూ... మన స్కూలు మర్రిచెట్టు అయిపోతే ఎన్ని వూడలయినా, ఏ ప్రాంతానికయినా లాగించగలం. ఇంద్రాణీ స్కూలు వాడు మనూళ్లో బ్రాంచీ పెడుతున్నాడట! తొందరగా చేరితే లక్కీడిప్‌లో ఒక కారు – అటు తర్వాత ఒక మోటారు సైకిలు, సైకిలు మొదలుగా ఒక గుండుసూదుల డబ్బాదాకా – ఎన్నో బహుమతులు – దురంధర: విద్యాశిఖర: అంబర డంబర: లహర్ లహర్ వంటి విద్యాసంస్థలు – లక్షల రూపాయల మీద పబ్లిసిటీయే ఇవ్వగలవు. 'కోటి రూపాయలుంటే, ఓ పాటి చిన్న బ్రాంచి తెరవొచ్చును' అన్నాడో ప్రయివేటు కాలేజీ బాస్.

ఇలాంటి ఖరీదయిన విద్యా సంస్థలకి తమ కష్టార్జితంతో పిల్లల్ని తోలే తల్లిదండ్రులు మాత్రం – కోటి రూపాయిలను ఒక్కసారి ఊహించుకోలేరు. కానీ వాళ్ల పిల్లలు చదివే స్కూలు – రూపాయల గోడలతో నడుస్తుందని.

'అమ్మో! మా పిల్లల స్కూల్లో చదువా? దివాళా తీసేస్తావ్. వద్దులే...' అని చెబుతూనే ఉంటారు యివతలి వాళ్ళకి. కార్పొరేట్ కాలేజీలకు అప్పో సప్పో చేసి మరీ పిల్లల్ని తీసుకుని పరుగులెడతారు. మా బెజవాడ వంటి చిన్న ఊళ్ళోనే పదిలక్షల మంది పిల్లకాయలు స్టార్

> గోపాలంకి ఆకాశంలో విహరించాలని చిన్నప్పట్నుంచీ కోరిక. అలాగే హెలికాప్టర్ డ్రైవింగ్‌లో ట్రైనింగ్ తీసుకున్నాడు. ట్రైనింగ్ పూర్తయింది. చివరిసారిగా పరీక్షిస్తున్నాడు అధికారి.
>
> గోపాలం హెలికాప్టర్‌ని పైకి తీసికెళ్లాడు... ఇంకా ఇంకా పైకి వెళ్ళి ఉన్నట్లుండి కూలిపోయింది. అదృష్టవశాత్తు గోపాలంకి ఏమీ కాలేదు.
>
> ఏమైంది? ఆత్రుతగా పరిగెట్టుకొచ్చాడు అధికారి.
>
> వెయ్యి మీటర్లు పైకి వెళ్లగానే ఉత్సాహం పెరిగింది. మరో వెయ్యి మీటర్లు వెళ్లాను... ఇంకా ఉత్సాహం అన్పించి మరో వెయ్యి మీటర్లు వెళ్లాను. అంతపైకి వెళ్లాక విపరీతంగా చలివేయడంతో పైన ఉన్న ఫ్యాన్ ఆపేసాను. అంతే... ఎందుకు కూలిపోయిందో తెలియదు...



స్కూల్స్‌కి, కాలేజీలకీ – మహారాజ పోషకులుగా ఉన్నారు.

స్కూలు బాగా 'రన్' అవుతూంటే పాఠ్యగ్రంథాలమ్మే వాళ్లు, నోట్ పుస్తకాలు అమ్మేవాళ్ళు, గైడ్‌లు, స్టడీ బుక్స్ యిస్తాం అని ఆర్డర్స్ తీసుకునేవాళ్ళూ – యూనిఫామ్స్, రబ్బర్లు, పెన్సిళ్ళు, సమోసాలు, టీలు సప్లయి యిస్తాం అనే వాళ్లు – పెద్ద డాక్టర్ల ఎదుట చిన్న బల్లల మీద పడిగాపులు పడే మెడికల్ ప్రతినిధుల్లాగా నిరీక్షిస్తూంటారు. స్కూలు యిచ్చిన బుక్సే చదవాలి – వాళ్ళ పెన్సిల్సే వాడాలి లేదా టి.సి. ఖాయం – అంటుంది యాజమాన్యం.

పుస్తకాల వాళ్లు అట్టమీద వేసిన రేటులో – బేరాన్ని బట్టి పది నుంచి ఏభై శాతం దాకా కమిషన్ యిస్తారు. స్కూలు యాజమాన్యం మాత్రం – పిల్లల తల్లిదండ్రులకి ఫుల్‌రేటుకే – లేదా ఓ పదో, పరకో చేర్చి మరీ అమ్ముతారు. బ్లాక్ మనీ జనరేట్ అవుతోంది యిలాగే మరి!

మరి స్కూలు నడపాలంటే, కాలేజీని 'రన్' చేయాలీ అంటే ఎంతమందిని మైంటైన్ చేయాలి? కారులో తిరగాలి. ఏ.సి.లో కూర్చోవాలి. వి.ఐ.పి.ల పరిచయాలు సంపాదించాలి. ఇలాంటి హంగులన్నీ ఉంటేగానీ స్టార్ విద్యా సంస్థ రన్నింగ్ దాకా ఎందుకు? 'వాకింగ్' కూడా చెయ్యలేదు.

నా ఆలోచనల్నించి లేపుతున్నట్లు ఫోన్ రింగ్... 'గురూగారూ! మీరన్నారుగా – "డోంట్ వర్రీ... బీ హ్యాపీ" అని. అదే పేరెట్టేశా, నా స్కూలుకి" అన్నాడు గుప్త తరంగ్. టక్కున కట్ అయింది ఫోన్.

సో... అప్పుడే అంత స్టాటస్ వచ్చేసిందన్న మాట! అంటే బిజీ అయిపోయాడు! మరో పదిరోజులు ఆగి వాడి దగ్గరకి వెళ్తే... 'ఎవరూ మీరు?' అని అడిగినా ఆశ్చర్యపడనక్కర్లేదు! అదే ఈ కాలం తీరు! అదే నాగరికత! ●